RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 137 | ఏప్రిల్ 23, 2025 | వెల : రూ.3-00



దిగి వస్తున్న ఉల్లి ధర

4లో..




## మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించిన సీఎం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రత్యేక ప్రతినిధి :**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జపాన్ పర్యటనలో భాగంగా హీరోషిమాలోని జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాని సందర్శించారు. భారత జాతిపిత విశ్వశాంతి దూత, మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జపాన్‌లోని ప్రసిద్ధ హీరోషిమ శాంతి స్మారకాన్ని సందర్శించారు. 1945 రెండో ప్రపంచ యుద్ధంలో హీరోషిమ పై జరిగిన అణుబాంబు దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అదేవిధంగా నాటి అణుబాంబు విధ్వంసంలో నిలిచిన ఏకైక శిథిలం అటామిక్ బాంబు డోమ్‌ను సందర్శించారు. ముఖ్యమంత్రి వెంట మంత్రి శ్రీధర్ బాబు, అధికారులు ఉన్నారు.

## రైతును ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

- రాంగ్ రూట్లో వచ్చి రైతు పైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు
- అక్కడికక్కడే రైతు దుర్మరణం
- బస్సు ఎదుటే మృతుని కుటుంబ సభ్యుల ఆందోళన

వేద న్యూస్, కమలాపూర్ 4లో..




# రూ.55 కోట్లతో.. అందాల పోటీల?

- రాష్ట్ర ఖజానాకు కటకట ఉన్నా..
- వెంటనే 'మిస్ వరల్డ్' రద్దు చేయాలి
- 'సుందరీమణుల కాంపిటీషన్' తెలంగాణ సంస్కృతికే విరుద్ధం
- హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్


**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి:**



కాంగ్రెస్ సర్కారు ఎన్నికల సమయం లో ఇచ్చిన గ్యారంటీలు, హామీల అమలుకు ఆర్థిక ఇబ్బందులున్నట్టు ఓ వైపు పేర్కొంటూ.. మరో వైపు రూ.55 కోట్లతో అందాల పోటీల నిర్వహణకు సమాయత్తమవుతుండటం సరికాదని హ్యూ మన్ రైట్స్ ఫౌండేషన్ తెలంగాణ స్టేట్ సంయుక్త కార్యదర్శి డాక్టర్ ఏ ఎస్ శ్రీనివాస్ పేర్కొన్నారు. సంస్కృతీ సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తూ, మహిళలను దేవతలుగా పూజించే భారతదేశం వంటి దేశంలో, మహిళా చైతన్యానికి ప్రతీకగా నిలిచే తెలంగాణ రాష్ట్రంలో అందాల పోటీలు నిర్వహించాలనుకోవడం దురదృష్టకరమని, అందాల పోటీలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన రిలీజ్ చేశారు.

తెలంగాణ సంస్కృతికి విరుద్ధంగా అందాల పోటీలు నిర్వహించడమే మొదటి తప్పు అని పేర్కొన్నారు. తెలంగాణ సభ్య సమాజం ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నదని వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సుందరీమణులను వారి అవయవాలు.. అంగాంగా ప్రదర్శనలు పర్యాటక ప్రదేశాలలో ప్రదర్శించి ప్రభుత్వమే వ్యాపారం చేయాలనే భావజాలాన్ని.. తెలంగాణ ప్రజలు వ్యభిచారంతో సమానంగా భావిస్తారని తెలిపారు.

మన చీర కట్టు-బొట్టు విదేశీ మహిళలు ప్రోత్సహిస్తుంటే.. మన సంస్కృతీ సంప్రదా యాలను గౌరవిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వాలే స్త్రీలను విలాస వస్తువులుగా భావించడాన్ని నేరమేనని వివరించారు. పాలకులు ఇప్పటికైనా పునరాలోచన చేసి 'మిస్ వరల్డ్ -2025' పోటీలను రద్దు చేయాలని కోరారు. హైదరాబాద్ వేదికగా సుందరీమణుల అందాలు ఆరబోసేందుకు ప్రభుత్వం రూ.55 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించడం తెలంగాణ సంస్కృతికే విరుద్ధం, అవమానకరం అని స్పష్టం చేశారు. అప్పుల తెలంగాణ రాష్ట్రంలో పేద కళాకారుల సంక్షేమం కోసం ఆ డబ్బును మళ్లించి కళలు, కళాకారులకు జీవం పోసేందుకు తెలంగాణ జానపదాల అకాడమీ ఏర్పాటు చేసి..సంస్కృతీ, విలువలను పునర్జీవింపజేసే ప్రయత్నం చేయాలని కోరారు. సర్కారు వ్యాపార దృష్టితో కాక మానవతా దృక్పథంతో ఆలోచించాలని అభ్యర్థించారు.



## వేసవి వడగాలుల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

**వేద న్యూస్, వరంగల్ :**

వేసవి వడగాలుల నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో వేసవి వడగాల్పుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్ డాక్టర్ సత్య శారద అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణితో కలసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వడగాలులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. జూలై వరకు ఆశా కార్యకర్తల నుంచి జిల్లాస్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరూ అవసరమైన మేరకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వడగాలుల వల్ల వచ్చే ప్రమాదాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ప్రచార బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. సమ్మర్‌కు సంబంధించి జిల్లా, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పట్టణాల్లో తాగునీటి

మిగతా 4వ పేజీలో..

# జాడ లేని బిల్లులు..!

- బిల్లుల కోసం మాజీ సర్పంచులు పాట్లు

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**



పనులు చేశాం..బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని మాజీ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసిన పనులకు బిల్లును రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆరోపిస్తున్నారు. జిల్లాలో కొంతమంది పనుల కోసం వడ్డీకి అప్పులు తీసుకువచ్చి వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం సత్వరమే చేసిన పనులకు బిల్లులను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే పదవి కాలం ముగిసి 18 నెలలు గడుస్తున్న చేసిన పనికి బిల్లులు అందక అవస్థలు పడుతున్నామని పలువురు సర్పంచులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో దాదాపు 844 గ్రామపంచాయతీలు ఉండగా మాజీ సర్పంచులు చేసిన పని బిల్లులో రూ.60 కోట్లు రావాల్సి ఉన్నట్లు తెలుస్తుంది. జిల్లాలో జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు కేంద్ర రాష్ట్ర ఆర్థిక సంఘాలు నిధులు అందించేవి. పల్లెల్లో ఈ నిధులతో అభివృద్ధి పనులు సర్పంచులు నిర్వహించారు. కానీ పనులు చేశారు... నిధులు జమ కాలేదని పేర్కొంటున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడం వల్ల బిల్లులు నిలిపివేశారని విశ్వసనీయ సమాచారం. కాగా ఎన్నికల ముగియడంతో చేసిన పని బిల్లులు కోసం మాజీ సర్పంచులు ఎదురుచూస్తున్నారు. మాజీ సర్పంచులు చేసిన పనులు సిసి రోడ్లు, గ్రామపంచాయతీ భవనాలు, డ్రైనేజీలు, వీధి దీపాలు, స్మశాన వాటికలు, పల్లె ప్రకృతి వనాలు, పైపులైన్లు,డంపింగ్ యార్డులు, క్రీడా మైదానాలు పనులను చేపట్టామని తెలుపుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి వెంటనే నిధులు జమ చేయాలని మాజీ సర్పంచులు కోరుతున్నారు.

## భూకబ్జాలపై కలెక్టర్‌కు వినతి

**వేద న్యూస్, మంచిర్యాల:**

బెల్లంపల్లిలో అక్రమ నిర్మాణాలతో పట్టణ ఉనికి ప్రమాదం పొంచి ఉన్నదని కాంగ్రెస్ నేత కొలిపాక శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. భూకబ్జాదారులపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 3వ వార్డులో రాజమల్లమ్మ పేరున ఏర్పాటు చేసిన సమాధుల ప్రాంతంలో ఆ



వార్డు కౌన్సిలర్ పత్తిపాక రేణుక మున్సిపాలిటీ ద్వారా ఇం నంబర్ పొంది సమాధులపై ఇంటర్‌నెట్ సెంటర్ పెట్టారని, వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మెయిన్ రోడ్‌పైన ఫుట్ పాత్ స్థలం కబ్జాకు గురవుతోందని, దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. కాంట్రాక్ట్ బస్తీలో గల్లీలు మూసివేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

- వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు

**వేద న్యూస్, వరంగల్ :**

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రపంచ ఆధిపత్యం కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న సామ్రాజ్యవాద దురహంకార విధానాలకు మద్దతు ఇస్తూ భారత దేశ ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నదని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు విమర్శించారు. మంగళవారం రష్యా సోషలిస్టు విప్లవ నిర్మాత కామ్రేడ్ లెనిన్ 155వ జయంతి, సిపిఐ ఎంఎల్ పార్టీ 56వ ఆవిర్భావదినోత్సవ సందర్భంగా ఖిలా వరంగల్, పడమర కోటలో న్యూ డెమోక్రసీ నాయకులు కామ్రేడ్ బండి కోటేశ్వరరావు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా న్యూ డెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు జెండాను ఎగరవేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మన దేశానికి వచ్చిన అమెరికా ఉపాధ్యక్షుడు వ్యాన్స్ తో మోడీ దేశానికి నష్టకరమైన రక్షణ ఇంధన, స్వేచ్ఛ వాణిజ్యం పేరుతో వ్యవసాయం పాడి పరిశ్రమ తదితర రంగాలలో అవమానకరమైన ఒప్పందాలు చేసుకునే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. అమెరికాలో చదువుకుంటున్న భారతీయ విద్యార్థుల జీవితాలతో దురంకార ట్రంప్ చెలగాటమాడుతుంటే ఇక్కడ మోడీ జె.డి వ్యాన్స్ పిల్లలతో ఆటలాడుకుంటున్నాడని ఆయన ఎద్దేవా చేశారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను బడా కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నాడని అన్నారు. అలాగే మధ్యభాగంలో ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసి జాతి ప్రజలపై మారణకాండ కొనసాగిస్తున్నాడని ఆయన అన్నారు. కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా, వివిధ వర్గాల ప్రజలు చేస్తున్న పోరాటాల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. పిడిఎస్ యు రాష్ట్ర పూర్వ ఉపాధ్యక్షులు

మిగతా 4వ పేజీలో..






## జర్నలిస్టుల దీక్ష శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ సారయ్య

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

వరంగల్ తూర్పు నియోజకవర్గ వర్కింగ్ జర్నలిస్టులు గత తొమ్మిది రోజులుగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సాధనకై చేపట్టిన నిరహార దీక్ష శిబిరాన్ని మంగళవారం మాజీ మంత్రి,ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన జర్నలిస్టులతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సాధనకై చేపట్టిన కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సారయ్య మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా పత్రికేయులతో వ్యక్తిగత సంబంధం ఉందని ఆ అభిమానంతోనే జర్నలిస్టుల శిభిరాన్ని సందర్శించినట్లు తెలిపారు.

దీక్షలు, నిరసనలు శాంతియుతంగా చేయడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని అన్నారు. జర్నలిస్టుల న్యాయం కోసం తమ వంతు సహాయ సహకారాలు చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అక్కినేపల్లి వంశ వృక్షం తయారీకి కమిటీ

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

ఇటీవల వనస్థలిపురంలో జరిగిన సమావేశంలో అక్కినేపల్లి వంశవృక్షం తయారు చేయాలి అని కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని కమిటీ సమన్వయకర్త ప్రొఫెసర్ రఘురాం అక్కినేపల్లి తెలిపారు. కమిటీ సమన్వయకర్తగా అక్కినేపల్లి రఘురాం రావు (దత్తప్ప గూడెం), సభ్యులుగా రమేష్ బాబు (రాయినిగూడెం), శ్రీనివాసరావు (గుడివాడ), శ్రవణ్ కుమార్ (ఫణిగిరి), అక్కినేపల్లి వెంకటేశ్వరరావు (చెట్ల చెన్నారం), అక్కినేపల్లి రవి (అడ్లూరు), అక్కినేపల్లి మురళీధర రావు, అడ్వకేట్ (ఓగోడు), అక్కినేపల్లి నిర్మల (దత్తప్ప గూడెం), కరుణా రామ్ కుమార్ (రాయినిగూడెం), సుధా ప్రవీణ్ కుమార్ (ఓగోడు), తిరుమల నాథ్ (కనగల్లు), విజయలక్ష్మి వెంకట రామారావు (రాయిని గూడెం), మనోజ్ కుమార్ లను నియమించినట్లు రఘురాంరావు తెలిపారు.

# రాజీవ్ యువ వికాసం గడువు పొడిగించాలి

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి 16 లక్షల వరకు దరఖాస్తులు రావడాన్ని స్వాగతిస్తున్నట్లు అదేవిధంగా రాజీవ్ యువ వికాసం గడువును ఏప్రిల్ 30వ తేదీ పొడగిస్తే మరింత మంది నిరుద్యోగులకు న్యాయం చేసినట్లు అవుతుందని ఈ బిసి జాతీయ అధ్యక్షులు రవీందర్ రెడ్డి కోరారు. ఈ పథకం మొదటి జాబితాలోనే తమను ఎంపిక చేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలను నిరుద్యోగులు కోరుతున్నట్లు సమాచారం.కాగా మూడేళ్ల పాటు కొనసాగించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నేతలు విజ్ఞప్తి చేశారని మరో సమాచారం.

# ఘనంగా కొప్పుల వేనారెడ్డి జన్మదిన వేడుకలు

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి:**



సూర్యాపేట పట్టణంలోని స్థానిక కొత్త బస్టాండు ఏరియాలో ఫ్లైఓవర్ వద్ద జిల్లా కాంగ్రెస్ నాయకులు జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు పబ్లిక్ క్లబ్ డైరెక్టర్ రాచకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణరెడ్డి జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర పీసీసీ సభ్యులు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణరెడ్డి పాల్గొనగా కేకు కటింగ్ నిర్వహించి దాదాపు 300 మంది బాటసారులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పబ్లిక్ క్లబ్ డైరెక్టర్ రాచకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొప్పుల వేనారెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా శరణార్థులకు బాటసారిలకు అన్నదానం నిర్వహించడం అభినందనీయమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కక్కిరేణి శ్రీనివాస్, రుద్రంగి రవి, బెలిదే శ్రీనివాస్, బిక్కుమల్ల కృష్ణ, వెంపటి శబరినాథ్, చల్లా లక్ష్మయ్య, వంగవీటి రమేష్, శ్రీరంగం రాము, వెంపటి రవితేజ, యమ సంతోష్, తెరటపల్లి సతీష్, గజ్జి నాగేందర్, జూలకంటి నాగరాజు, గుండా లక్ష్మయ్య, బజ్జురి శ్రీనివాస్, బెల్లీదే శ్రీనివాస్ బంక్, తదితరులు పాల్గొన్నారు.

# స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ విధానం రద్దు చేయాలి

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి:**



భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం ప్రభుత్వం తెచ్చిన స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ విధానమును రద్దుచేసి పాత పద్ధతిని కొనసాగించాలని సూర్యాపేట జిల్లా రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ అధ్యక్షుడు తెలంగాణ జై గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తెలంగాణ సామాజిక ఉద్యమకారుడు సావిత్రిబాయి పూలే జాతీయ విశిష్ట సేవ అవార్డు గ్రహీత పంతంగి వీరస్వామి గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట సూర్యాపేట దస్తావేజు లేఖరుల నిరసన ధర్నా కార్యక్రమానికి సంఘీభావం ప్రకటించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ విధానం తేవడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది డాక్యుమెంట్ రైటర్లకు పని లేకుండా పోవడం వల్ల వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉందని అన్నారు. ప్రభుత్వం వెంటనే పునరాలోచించి పాత పద్ధతులే కొనసాగించి డాక్యుమెంటరీలకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో కూడా స్లాట్ బుకింగ్ విధానం ఆన్లైన్లో చేయడం వల్ల సర్వర్ డౌన్ సమస్య లేదురై ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మే మాసం నుండి నూతన స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ విధానం కొనసాగిస్తామని చేసిన ప్రకటనను వెనక్కి తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతిలో కూడా స్వల్ప మార్పులు చేయాలని విజ్ఞప్తి చేశారు. కోర్టు కేసులో ఉన్న భూముల విషయంలో అధికారులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకొని కోర్టు పరిధిలో ఉన్న వివాదాల భూములకు పాస్ పుస్తకాలు జారీ చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటే కోర్టు ధిక్కరణ కింద అధికారులకు ఇబ్బందులు తప్పవని తెలిపారు. ప్రభుత్వం ఎల్లారీస్ గడువు పెంచి నాలా కన్వర్షన్ మీద ఎకరంలోపు భూములకు రిజిస్ట్రేషన్లు చేసేలా మార్గదర్శకాలు విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ%శీ% తీసుకున్న హైడ్రా నిర్ణయంతో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని రియల్ ఎస్టేట్ వ్యాపారంపై ఆధారపడ్డ ఎంతోమంది జీవితాలు అంధకారంలోకి నెట్టివేయబడ్డాయని వాపోయారు. ఎఫ్ టి ఎల్ పరిధిని 200 మీటర్లు కాకుండా కేవలం 30 మీటర్ల వరకే తగ్గించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 142 రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో కొన్ని మాత్రమే పక్కా భవనాలు ఉన్నాయని లేనిచోట ప్రభుత్వం నూతన భవనాలు నిర్మించి రిజిస్ట్రేషన్ కార్యాలయం పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. కార్యాలయాలలో కంప్యూటర్ ఆపరేటర్లతో పాటు సిబ్బందిని పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ పట్టణ అధ్యక్షుడు జలగం సత్యం గౌడ్, జిల్లా గౌరవ సలదారుడు దేవత్ కిషన్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెన్నా శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కోశాధికారి పాల సైదులు, జిల్లా కార్యదర్శి కంభంపాటీ అంజయ్య, గౌడ్ రియల్ ఎస్టేట్ జిల్లా ఉపాధ్యక్షుడు బాబా, జిల్లా ఉపాధ్యక్షుడు కోడి లింగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మహంకాళి ప్రణీత్, జిల్లా డాక్యుమెంట్ రైటర్ కందిమల్ల మధు, వేముగంటి రవీందర్, ఆకునూరి మురళి, మనోహర్, ఎస్కే తన్నీరు, ఎస్కే నజీర్, సోమయ్య, ఈర్లపాటి వెంకన్న, అన్వర్ పాషా, తదితరులు డాక్యుమెంట్ రైటర్లు పాల్గొన్నారు

# ఆదర్శ పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు



**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ నియోజకవర్గం దామచర్ల మండల పరిధిలోని బోత్తలపాలెం ఆదర్శ పాఠశాలలో వార్షిక దినోత్సవం పురస్కరించుకొని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.ఇందులో భాగంగా విద్యార్థులు చక్కని నృత్య ప్రదర్శనలు,ఆత్మ రక్షణ కోసం కరాటే ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వాడపల్లి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు చిన్న వయసు నుంచి క్రమశిక్షణను పాటించాలని,జీవితంలో ఎప్పటికీ విలువలను మర్చిపోవద్దని నైతిక విలువలను ఆచరిస్తూ,చదువుల్లో ఆటల్లో పాటలు రాణించాలని తెలియజేశారు.ఈసందర్భంగా ప్రిన్సిపాల్ పోతురాజు నరహరి మాట్లాడుతూ ఆటపాటలతో చురుకుగా ఉన్నవారు చదువుల్లో కూడా రాణించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బోత్తల పాలెం ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ లావూరి నాగలక్ష్మి,ఆయాజ్,భాస్కర్,రాజు, రాము, శ్రీను, బాబ్లీ, హుస్సేన్, ప్రసాద్,సమీనా, శ్రావణ్,రాంబాబు, సతీష్, రహీం, లక్ష్మణ్, అనిత, యాదగిరి, సఫీనా,రవికాంత్,విద్యాసాగర్, కవిత,దుర్గా,లలిత తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాలలో అరోరా ప్రభంజనం

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**



మెట్ పల్లి పట్టణంలో ఆరోరా జూనియర్ కళాశాలలో 2025 ఇంటర్ ఫలితాలలో విద్యార్థిని విద్యార్థులు రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన విద్యార్థిని సింగ్ మైకా 470 కి గాను 464 మార్కులు సాధించి మెట్ పల్లి పాత తాలూకాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల కరస్పాండెంట్ గడ్డం తిరుపతిరెడ్డి, ప్రిన్సిపల్ చంద్రశేఖర్ లు అధ్యాపక బృందం అభినందించారు.

# స్టేట్ ర్యాంకుతో సంచలనం సృష్టించిన రేస్ కళాశాల

**వేద న్యూస్, కోదాడ :**



మంగళవారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో కోదాడ పట్టణానికి చెందిన రేస్ ఐఐటి మెడికల్ అకాడమీ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో తమ సత్తా చాటారు. కళాశాలకు చెందిన వంగవేటి అక్షయ హాల్ టికెట్ (2552107410) ఎంపీసీ ప్రథమ సంవత్సరం నందు 470 మార్కులకు గాను 468 మార్కులతో రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించింది. చిత్తార చరణ్ శ్రీ తేజ ,జీడిమెట్ల లేఖనా రెడ్డి, ముక్క చరణ్ సాయి గౌడ్ లు 467 మార్కులు సాధించి రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచారు. రెడ్డిమల్ల భార్గవి 466, మారెడ్డి మణిదీప రెడ్డి 465, మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం బైపిసి విభాగం నందు ఉప్పెల్లి అలేఖ్య 440 మార్కులకు గాను 437 మార్కులు సాధించారు. షేక్ సుహానా 432 మార్కులు రాష్ట్రస్థాయిలో సాధించారు. సీనియర్ ఎంపీసీ విభాగం నందు ఈగోటి సన్నీ 1000 మార్కులకు గాను 994 మార్కులు సాధించి రాష్ట్రంలో ద్వితీయ ర్యాంకు సాధించింది. జనగం తేజస్వి 991 కట్టమూరి కీర్తన 990 మార్కులు సాధించగా సీనియర్ బైపిసి విభాగంలో పారెల్లి వర్షిత 975 దేవారం కీర్తన రెడ్డి 974 మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా రేస్ ఐఐటి మెడికల్ కళాశాల చైర్మన్ బాణాల వసంత వెంకటరెడ్డి రాష్ట్ర ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కృషి చేసిన ఉపాధ్యాయులను అధ్యాపక బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. జాతీయస్థాయి మెయిన్స్ ఫలితాలలో ఇంటర్ ఫలితాలలో అత్యంత ర్యాంకులు మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. రానున్న జేఈఈ అడ్వాన్స్ ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో ఎంసెట్ ఎఫ్ సెట్ ఫలితాలలో విద్యార్థులు ముందంజలో ఉంటారని ఆమె తెలిపారు. అనంతరం కళాశాల యజమాన్యం కోదాడ పట్టణంలో విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి బాణాసంచా కాలుస్తూ తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ,అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో జయ విద్యార్థుల ప్రతిభ

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి:**




మంగళవారం వెలువడిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరిచినట్లు జిల్లా కేంద్రంలోని జయ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. ఆ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో జి.మనో వర్షిత 468, డి.సిరి 468, ఆర్.సిద్ధార్థ 468, ఎండి.సాదియా 467, బి.శ్రీవర్ష 466, జి.శ్రీనిఖ 466, అశువర్ధన్ రెడ్డి 466, ఎండి.ముస్కాన్ 466, ఎండి అజీజ్ యుఆర్ రెహమాన్ 466, ఎన్.శ్రీలక్ష్మి 465, ఎస్.నిహారిక 465, జి.లాస్య 465, ముజ్ తబాఖాన్ 465 మార్కులను సాధించినట్లు తెలిపారు. 460కు పైగా మార్కులను 46 మంది, 450కు పైగా మార్కులను 70 మంది విద్యార్థులు సాధించినట్లు తెలిపారు.బైపిసి గ్రూపులో జె.శ్రీనిత్య 432, ఎం.విజిత 430, జె.మానస 430 మార్కులు సాధించినట్లు తెలిపారు.ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో కె.యామిని 992, వి.బిందు మాధవి 991, అమిత్ సూర్య 989, బి.రిషిక 989, టీ.అమూల్య 988, ఎస్.నక్షత్ర 988, జి.తేజశ్రీ 987, శ్రీ హన్సితశ్రీ 987, హన్సిని 986, ప్రియదర్శిని 985, కె.సింధూర 984, కావ్యశ్రీ 982, బి.లాస్య 982, ఉజ్వన్ 981 మార్కులను సాధించినట్లు చెప్పారు. 980కి పైగా మార్కులను 13 మంది, 950కి పైగా మార్కులను 43 మంది విద్యార్థులు సాధించినట్లు తెలిపారు.బైపిసి గ్రూపులో టీ.తరుణ్ 983, జెవి. అవినిష్ 980 మార్కులను సాధించారని చెప్పారు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను, ఈ ఫలితాల సాధన కృషిచేసిన అధ్యాపకులను అభినందించారు.తమకు సహకరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులను అభినందించిన వారిలో కళాశాల డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# హరిణికి వెల్లువెత్తుతున్న అభినందనలు


**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి :**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో నివసించే నిరుపేద కుటుంబానికి చెందిన వెల్దండి హరిణి సెకండియర్ లో 960 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా హరిణికి సోషల్ మీడియాలో అభినందనలు తెలుపుతున్న అనేక మంది నెటిజన్స్ హరిణి చిన్నప్పటి నుండి చదువులో ముందుండి తన తండ్రి పోరాట పటిమను అందిపుచ్చుకుని ఎక్కడ అన్యాయం జరిగినా ఊరుకోకుండా పదవ తరగతిలోనే మోడల్ స్కూల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై పోరాటం చేసి ప్రిన్సిపాల్, డిఈఓ, ఎం. ఈ.ఓ తో పాటు అనేక మందిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవడంలో హరిణి పోరాట పాత్ర పోషించిందని పేర్కొన్నారు. తాను చేసిన ఉద్యమంతో మోడల్ స్కూల్లో అనేక అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట పడిందని ఇలా ఎన్నో సమస్యలు ఎదుర్కుంటూ తాను ఎప్పటికైనా జడ్జ్ కావాలనే కోరికతో పదవ తరగతి, ఇంటర్, ప్రస్తుతం మాస్టర్ మైండ్ కాలేజీలో ఇంటర్ సెకండియర్ లో మొదటి స్థానంలో నిలిచింది.ఇది చూసిన నెటిజన్స్ హరిణి తప్పకుండా జడ్జి అవుతుందని కొనియాడారు.

# వ్యాన్ లోయలో పడి 16 మంది మృతి

**వేద న్యూస్, డెస్క్:**



దక్షిణ పాకిస్థాన్‌లో ఘోర ప్రమాదం జరిగింది. ఓ బస్సు లోయలో పడింది. ఈ ఘటనలో 16 మంది మరణించారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు ఉన్నారు. సుమారు 30 మంది గాయపడ్డారు. సింధు ప్రావిన్సులోని జామ్‌షోరో జిల్లాలో ఈ దుర్ఘటన జరిగింది. అతి వేగంతో వెళ్తున్న డ్రైవర్.. బస్సును అదుపు చేయలేకపోయినట్లు తెలుస్తోంది. స్పాట్‌లోనే 16 మంది ప్రాణాలు కోల్పోయారు. పంజాబ్ ప్రావిన్సులోని కొల్హి తెగకు చెందిన వ్యక్తులు సింధు ప్రావిన్సుకు వెళ్తున్నారు. పోలీసులు, రెస్క్యూ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. ప్రమాద బాధితులను సమీప ఆస్పత్రికి తరలించారు. బలోచిస్తాన్‌లో గోధుమ పంట కోత తర్వాత కార్మికులు తమ స్వస్థలానికి తిరిగి వెళ్తున్న సమయంలో బస్సు ప్రమాదానికి గురైంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నది. గాయపడ్డవారిలో చాలా మంది ఆరోగ్యం విషమంగా ఉన్నది.

# మొదటి బ్యాచ్ లోనే స్టేట్ ర్యాంకులు సాధించిన ఎన్ఆర్ఎస్ కాలేజ్

**వేద న్యూస్, కోదాడ :**

మంగళవారం ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాలలో సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణానికి చెందిన ఎన్ ఆర్ ఎస్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో కొమ్మినేని సంతోష్, పీ. అమృత సుధ వర్షిణి లు 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించారు. అదే విధంగా కాలేజ్ కు చెందిన ఎల్. రక్షిత, శరణ్య లు 467 లు సాధించి స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించారు. అదే విధంగా కాలేజ్ కు చెందిన హర్షిత, ప్రాచీ లు 465, యశశ్విని, సౌజన్య, జస్వంత్ లు 464, బీ. గణేష్ 463, దీక్షిత 462, సింధు శ్రీ , శ్రీజిత 461, ప్రలేక్య 460 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించారు. అదే విధంగా ఇంటర్ సెకండ్ ఇయర్ ఎం పీ సీ విభాగంలో కే. గాయత్రి 988 , ప్రవల్లిక రెడ్డి లు 987 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి లో ర్యాంకులు సాధించారు. బైపీసీ విభాగంలో పీ. పల్లవి 986 సాధించి స్టేట్ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా కాలేజీ చైర్మన్ వడ్డే రాజేష్ చౌదరి, డైరెక్టర్ యర్రమాసు మనోహర్ రెడ్డి, కరెస్పాడెంట్ వేణుగోపాల్ రావు, అకడమిక్ అడ్వైజర్ మైనం రామయ్య లు మాట్లాడుతూ తమ కాలేజ్ స్థాపించిన రెండు సంవత్సరాలలోనే ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ లలో తమ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారన్నారు. అదే విధంగా జేఈఈ మెయిన్స్ ఫలితాలలో జాతీయ స్థాయిలో 207, 1450 ర్యాంకులను సాధించారని ఈ విజయాలు తమకు గర్వకారణమని తెలిపారు. తమ అధ్యాపకుల కృషి, అంకితభావం, విద్యార్థుల పట్టుదలతో ఈ విజయం సాధ్యమైనట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యంతో పాటు వైస్ ప్రిన్సిపాల్ గంధం వెంకటరమణ (జీ వీ) , క్యాంపస్ ఇన్చార్జి పీ. యెన్. ఆర్, లెక్చరర్లు, సిబ్బంది అభినందించారు.



# ఉగ్రవాదుల దాడిపై ప్రధాని ఆరా

**వేద న్యూస్, డెస్క్:**



జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఇవాళ పర్యటకులపై జరిగిన ఉగ్ర దాడిని ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. సౌదీ పర్యటనలో ఉన్న ఆయన కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఫోన్‌లో మాట్లాడారు. దాడి ఘటన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటనపై తగిన చర్యలు తీసుకోవాలని, తక్షణమే ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించాలని అమిత్‌షాను ప్రధాని ఆదేశించారు. ఈ ఉగ్రదాడిపై అమిత్ షా స్పందిస్తూ.. పర్యటకులపై దాడి తీవ్రంగా బాధించిందన్నారు. దాడికి పాల్పడిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని చెప్పారు. నేరస్థులపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఘటన గురించి ప్రధాని మోదీకి వివరించానని, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించానని చెప్పారు. అత్యవసర భద్రతా సమీక్ష కోసం తాను శ్రీనగర్ వెళ్తున్నానిని వెల్లడించారు. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి ట్వీట్ చేశారు. కాగా ఈ ఉగ్రదాడిని జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా కూడా ఖండించారు. దీనిని హేయమైన చర్యగా పేర్కొన్నారు. దాడికి పాల్పడినవారు మానవ మృగాలని, ఘటనను ఖండించేందుకు మాటలు రావడం లేదని సోషల్ మీడియా వేదికగా ఒమర్ ఆవేదన వ్యక్తం చేశారు.

# రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ రాంబాబు మృతి

**వేద న్యూస్, కోదాడ :**





సోమవారం రాత్రి మునగాల పోలీస్ స్టేషన్ పరిధి ముకుందాపురం వద్ద జాతీయ రహదారి 65 పై రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్ రాంబాబు భౌతికకాయానికి పోలీసులు పూలమాలవేసి పోలీస్ శాఖ తరపున ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాంబాబు మరణించడం చాలా బాధాకరం అన్నారు. దహన సంస్కారాల నిమిత్తం కానిస్టేబుల్ కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయాన్ని అందించారు. రాంబాబు కుటుంబాన్ని పోలీస్ శాఖ అన్ని విధాల ఆదుకుంటుందని అన్నారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం ద్వారా పోలీసు శాఖ ద్వారా రావలసిన అన్ని రకాల ఆర్థిక తోడ్పాట్లను ప్రభుత్వ సహాయంతో అందించే కారుణ్య నియామక ఉద్యోగం త్వరగా వచ్చేలా కృషి చేస్తాం అన్నారు. పోలీసు సిబ్బంది విధులు నిర్వహణలో జాగ్రత్తగా ఉండాలని విధులలో అలసిపోతే కాస్త విశ్రాంతి తీసుకోవాలని విశ్రాంతి అనంతరం ప్రయాణాలు చేయడం మంచిదని అన్నారు. రాత్రి వేళ సొంత వాహనాలపై ప్రయాణం చేయకపోవడం మంచిది అన్నారు. పోలీసు సిబ్బంది అందరూ సాలరీ బ్యాంక్ అకౌంట్ కు పోలీస్ సాలరీ ప్యాకేజీ తీసుకోవాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ, మునగాల సిఐ రామకృష్ణా రెడ్డి, సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వీర రాఘవులు, పోలీసు సంఘం అధ్యక్షులు రామచందర్ గౌడ్, మునగాల ఎస్సై ప్రవీణ్ కుమార్, కోదాడ ట్రాఫిక్ ఎస్సై మల్లేశం, పోలీసు సిబ్బంది, మృతుని బంధువులు తదితరులు పాల్గొన్నారు.

# బయటి నుంచి వచ్చిన గూండాలే ఆ అల్లర్లకు కారణం

**వేద న్యూస్, డెస్క్:**



వక్ఫ్ చట్టం అమలుకు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్‌లో మొదలైన నిరసనలు ఆఖరికి ఉద్రిక్తంగా మారిన సంగతి తెలిసిందే. అయితే ఈ అల్లర్లపై తాజాగా బెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పందించారు. ముర్షిదాబాద్ అల్లర్లకు బయటి నుంచి వచ్చిన వ్యక్తులే కారణమని మండిపడ్డారు. బెంగాల్ సరిహద్దుల నుంచి అక్రమంగా రాష్ట్రంలోకి ప్రవేశించిన కొందరు గూండాలు యువకులను రెచ్చగొట్టి ఉద్రిక్తతలకు కారణమయ్యారని ఆరోపించారు.

# విద్య వైద్యం ఉపాధి కనీస అవసరాలకు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం

– నాణ్యమైన ఉచిత విద్య వైద్యం సమకూర్చే మా బతుకు మేం బతుకుతాం. – మీ రాజకీయ లబ్ధి కోసం వాగ్దానాలు హామీలు ఇచ్చి మమ్ములను బిచ్చగాళ్ళుగా మార్చవద్దంటున్న ప్రజలు

**వేద న్యూస్, డెస్క్:**

పార్టీలు ఏవైనా వాటి గెలుపు అస్తిత్వం లబ్ధి ప్రయోజనం ఉనికి కోసం మిగతా పార్టీల మాదిరిగానే ఉచితాలు తాయి లాలు, వాగ్దానాలలో పోటీ పడడం, ప్రజలను యాచకులుగా మార్చి బలి పశువులను చేయడం, ఏనాడు కూడా ప్రజలను ప్రభువులుగా చూడకపోవడం, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించి ప్రతిఘటించిన సందర్భంలో ప్రతిపక్షాలు ప్రభుత్వ పక్షం కూడా ఒకటి కావడం వంటి నీచమైన స్థాయికి దిగజారుతున్న రాజకీయ పార్టీల అస్తిత్వాన్ని ప్రశ్నించవలసినటువంటి అవసరం ఆసన్నమైనది. సంఘటిత రంగాలలో పనిచేస్తున్నటువంటి కార్మికులు ఉద్యోగులు వారి డిమాండ్ల మేరకే పరిమితం కావడం అసంఘటిత రంగంలో ఉన్నటువంటి అశేష ప్రజలు కార్మికులు, చేతివృత్తుల వాళ్ళు, చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు, ఒకటి కాకపోవడం, లక్షల సంఖ్యలో భూమిని శ్రమను నమ్ముకుని ఈ దేశ ప్రజలందరికీ తిండి పెడుతున్నటువంటి రైతన్నలు కొంత సంఘటితమై పోరు సలిపి తమ హక్కుల కోసం డిమాండ్ చేసిన సందర్భంలో నిర్బంధము అణచివేత ద్వారా రాజ్య హత్యలు కొనసాగిన ఈ దేశంలో ఇక ఏ వర్గం తనకు తానుగా ప్రభుత్వాలను ప్రశ్నించగలదు?ఏ రాజకీయ పార్టీ ప్రజల పక్షాన నిలిచి ఉండగలదు ఒక్కసారి మనం ఆలోచిద్దాం.

– ఒకే తానులోని ముక్కలే అన్ని రాజకీయ పార్టీలు :-

సిద్ధాంతపరమైన ప్రాపంచిక దృక్పథము లేదా శాస్త్రీయ అవగాహన వంటి కొన్ని అంశాలలో మినహాయిస్తే పరిపాలన క్రమంలో ప్రజల పట్ల వ్యవహరించే తీరులో, ప్రజా ఉద్యమాలను అణచివేసే కోణంలో సుమారుగా అన్ని రాజకీయ పార్టీలు ఒకే లాగా వ్యవహరిస్తున్నాయి .ఒక పెద్ద తానులో ఎన్ని ముక్కలు కట్ చేసినప్పటికీ అన్నిటి యొక్క రూపం సారము ఆకర్షణ నిర్మాణం ఒకే రకంగా ఉంటుంది కదా! భారత రాజకీయ క్షేత్రంలో పనిచేస్తున్నటువంటి రాజకీయ పార్టీలన్నీ కూడా సుమారుగా అదేవిధంగా ఒకే రకంగా వ్యవహరించడాన్ని మనం గత 78 సంవత్సరాలుగా చూడవచ్చు. ముఖ్యంగా ప్రజా అవసరాలను గుర్తించకపోవడం, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను తీసుకోవడం ,ప్రజలు బలి పశువులైన సందర్భంలో రాజ్యాంగం ఇచ్చిన స్ఫూర్తి మేరకు ప్రతిఘటన ప్రశ్నించడంతోపాటు నిరసన పోరాట ఉద్యమాలకు శ్రీకారం చుట్టడం వంటి సందర్భాలలో తమ అస్తిత్వాన్ని ప్రశ్నించినప్రజలపట్ల ఏ రాజకీయ పార్టీ కూడా ఆలోచించకుండా అణచివేసి రాజ్య హింసకు పాల్పడి మన మీద హింసాను సృష్టిస్తున్న సందర్భాలను మనం పెద్ద మొత్తంలో గమనించవచ్చు .ప్రజలకు అవసరమైనటువంటి కనీస అవసరాలు ఏమిటి? కనీస అవసరాలకు నోచుకున్న వారికి మధ్యతరహా అవసరాలు ఏమిటి? అత్యున్నత స్థాయిలో అవకాశాలు అవసరాలు ఏమిటి అనే విషయాన్ని కూడా పాలకులు గమనించవలసిన అవసరం ఉంటుంది. దశలవారీగా ఈ తే డాలను సరి చేస్తూ అంతరాలు అసమానతలు లేని వ్యవస్థను తీర్చిదిద్దడం ద్వారా సమసమాజాన్ని స్థాపించుకోవడం మనం రాజ్యాంగంలోని ఒక లక్ష్యంగా పీఠికలో సామ్యవాదం అనే పేరుతో చక్కగా రాసుకున్నాం. రాజ్యాంగ నిర్మాణంలో ప్రజల అవసరాలను గుర్తించడంలో పాలకులను హెచ్చరించడంలో ఎక్కడ కూడా ఒక్క శాతం కూడా పొరపాటు లేనేలేదు. జరిగిన జరుగుతున్న పొరపాటు పాలకులు రాజ్యాంగాన్ని చట్టాన్ని న్యాయాన్ని న్యాయవ్యవస్థను చివరికి సర్వోన్నత న్యాయస్థానాన్ని కూడా ప్రక్కన పెట్టి తమ రాజకీయ లబ్ధి కోసం ఎంతటి అవినీతి అకృత్యాలు అరాచకాలకు దిగుతున్నారు అని చెప్పడానికి మనకు వేల వేల ఉదాహరణలు ఉన్నాయి. ఇక అలాంటి పరిస్థితుల్లో ప్రజలు తమకు ఉచితంగా నాణ్యమైన విద్య,నాణ్యమైన వైద్యము, ఉపాధి అవకాశాలు, డాక్టర్ అమర్త్యసేన్ చెప్పిన మాదిరిగా కనీస మానవ అవసరాలు అయినటువంటి రహదారులు మంచినీరు విద్యుత్ శక్తి గృహ వస్తే వంటి సౌకర్యాలను కల్పించడం కూడా ప్రభుత్వాల బాధ్యత. కానీ ఈనాడు మనదేశంలో అరగుంట ఇంటి స్థలం కోసం పోరాడితే కాల్పులు జరిపి హత్య చేసిన ప్రభుత్వాలు ఉన్నాయి. ప్రజలు ప్రజాస్వామికవాదులు ఉద్యమకారులు భూమి పంపిణీ చేయాలని ఉపాధి కల్పించాలని తగిన గిట్టుబాటు కూలి ఇవ్వాలని పోరాటం చేసినందుకు వారి పక్షాన మాట్లాడిన ఎందరో ఈ వ్యవస్థలో నేలకొరిగి నారు. ప్రజాసంపద కొల్లగొట్టబడుతూ ఉంటే ప్రజలందరికీ సమానంగా పంపిణీ చేయాలని,అలాంటి సమ సమాజం ఆవిర్భావం కావాలని, దశాబ్దాలుగా పోరాడుతున్న వాళ్లను పిట్టల్లా కాల్చివేస్తూ ప్రజలను భయకంపితులను చేస్తున్నారు. అలాంటప్పుడు రాజ్యాంగంలో రాసుకున్న అంబేద్కర్ అనుమానం వ్యక్తం చేసిన ఉచిత విద్యా వైద్యం చట్టబద్ధం ఎలా అవుతుంది? ఇప్పటికీ ఏ రాజకీయ పార్టీ కూడా ఉచిత విద్య వైద్యము ఉపాధి ఉద్యోగ అవకాశాలు తమ ప్రధానమైన అంశాలని మేనిఫెస్టోలో ప్రకటించి అమలు చేసిన సందర్భాలు లేవు.

ఈ ప్రధానమైన అంశాలు గాలికి వదిలేయబడి ప్రజలను ఆకర్షించే పథకాలను ప్రవేశపెట్టి యాచకులుగా మార్చుతున్న సందర్భంలో ఉచితాలు తాయిలాలు మాకు అవసరం లేదని రాజ్యాంగం నిర్దేశించిన ఉచిత విద్య, వైద్యము, న్యాయము, ఉపాధి మాత్రమే మేము డిమాండ్ చేస్తున్నామని అందరికీ ఉపాధి కల్పిస్తే,జీవన ప్రమాణాలను పెంచగలిగినటువంటి పని చూపిస్తే, ఆత్మగౌరవంతో జీవించే అవకాశాలను మెరుగుపరిస్తే, ప్రభుత్వం నుండి ఏ విషయంలో మేము సహకారం అడగమని మా పిల్లల పెళ్లి చేసుకోవడానికి మీరు డబ్బులు బంగారం ఇవ్వాల్సిన అవసరం లేదని కచ్చితంగా చెబుతున్నారు. ప్రజలను ఆ వైపుగా సిద్ధపడే లోపునే అరకొర ఆకర్షణతో లాలూచీ విధానాల ద్వారా ప్రజలను లొంగదీసుకుంటున్నారు కనుక చివరికి ప్రజలు ఆశాపరులని ఎంతకైనా దిగజారుతారని చెప్పడానికి రాజకీయ పార్టీలు సందేహించడం లేదంటే ఎంతకు దిగజారినట్లు అర్థం చేసుకోవచ్చు.

**ప్రజల సవాల్కు జవాబు చెప్పగలరా :**

మేము అడగని వాటిని మాకు రుచి చూపించి మా ఆలోచనలను నీరుగార్చి మద్యం మత్తు అశ్లీల అరాచక అకృత్య పరిపాలన వాతావరణాన్ని కల్పించి అందులో మేము బలి పశువులుగా మారే విధంగా ప్రోత్సహించి సమాజాన్ని భ్రష్టు పట్టిస్తున్న పాలకులారా! ఇప్పటికైనా మా సవాల్ కు జవాబు చెప్పండి.మా నిజాయితీని నమ్మి మేము ఆత్మగౌరవంతో బ్రతకడానికి తోడ్పడండి. సమాజం మొత్తానికి సంబంధించిన ప్రజాధనాన్ని కొన్ని వర్గాలకు మాత్రమే కొన్ని తప్పుడు నిర్ణయాల పేరుమీద ఖర్చు చేసి ప్రజలకు ద్రోహులుగా మిగలకండి.. అశాస్త్రీయ భావాలను అంద విశ్వాసాలను మా పైన రుద్ది వెలిగిపోతున్నది, వికసిస్తున్నది, బంగారు మయం అవుతున్నది అని ప్రలోభాలు పలికి మమ్ములను గుడ్డివాళ్లను చేయకండి! ప్రజలు చేసే డిమాండ్లను పాలకులు కల్పించాలి. ప్రజల అవసరాలను పాలకులు తీ ర్చాలి. ప్రజా ఆకాంక్షల మేరకు పరిపాలన కొనసాగాలి. ప్రజలను కన్నబిడ్డల వలె పాలించాలి. కానీ ఎప్పుడైనా కన్న బిడ్డల వలె పాలించినారా? అవును ఇటీవలి కాలంలో జరుగుతున్న ఒక అద్వాన్నమైనటువంటి విషయాన్ని గమనిస్తే మీ ఆలోచన కూడా నిజమే అనిపిస్తుంది.

ఎందుకంటే కన్న తల్లిదండ్రులు పిల్లలను హత్య చేసి ఆత్మహత్య చేసుకుంటున్నారు, అక్రమంగా కన్నటువంటి పిల్లలను ముళ్ళ పొదలకు చెత్తకుప్పలకు బలి చేసి వాళ్ళు సుఖపడుతున్నారు, విపరీతమైన అప్పులు చేసి విలాసాలకు పాల్పడి కుటుంబాన్ని బజారుకీడుస్తున్నారు.

కన్న తల్లిదండ్రులే తమ పిల్లలపైన ఈ రకంగా చేసినప్పుడు కోట్లాది ప్రజలందరిని మీరు మాత్రం ఏ రకంగా కన్నబిడ్డల వల్ల చూసుకోగలరు? అందుకే అంతకుమించిన స్థాయిలో కాల్చి వేస్తున్నారు. జైలు పాలు చేస్తున్నారు. పీడిస్తున్నారు. యాచకులుగా మారుస్తున్నారు. పన్నుల రూపంలో పేదలను కొల్లగొడుతున్నారు. మద్యం ఏరులా సరఫరా చేసి సమాజం నిర్వీర్యమై అనారోగ్యం పాలై ప్రశ్నించకుండా మౌనంగా ఉండాలని ఆశపడుతున్నారు. ఇదేనా ప్రజలను కన్నబిడ్డల వలె పాలించడం? ఇదేనా సుపరిపాలన .?

ఇప్పటికీ ప్రజలు ప్రజాస్వామ్యవాదులు సమీక్షించుకోవాల్సిన అవసరాలు చాలా ఉన్నది. అదే సందర్భంలో రాజకీయ పార్టీలు అధికారానికి ఎక్కినటువంటి ప్రభుత్వాలు ప్రజా సంఘాలు విప్లవోద్యమంలో మునిగి తేలుతూ ప్రజల కోసం పనిచేస్తూ అసువులు బాసి ఈ దేశ పాలకులతోనే చంపబడుతున్నటువంటి ఉద్యమకారులు రైతులు కార్మికులు చేతివృత్తుల వాళ్ళు చి రు వ్యాపారులు వివిధ వ్యాపారులు అస్తిత్వానికి దూరమై జానెడు పొట్ట నిండడం గగనమవుతున్నటువంటి అనేక వర్గాలు కూడా ఆలోచించాలి. ఐక్యతను చాటాలి తమ డిమాండ్లను స్పష్టంగా ప్రకటించాలి. ప్రభుత్వాన్ని ఆలోచించేలా చేయాలి ప్రభుత్వం పైననే ప్రజలు నిర్బంధాన్ని విధించి తమ హక్కులను సాధించుకోవాలి

ఆ రకమైనటువంటి స్వేచ్ఛ స్వాతంత్రం హక్కులు అవకాశాలు రాజ్యములో స్పష్టంగా ఉన్నాయి. 40 శాతం సంపద ఒక్క శాతం సంపన్న వర్గాల చేతిలో ఉంటే ఒక్కనాడు అయ్యో అననటు వంటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను కన్నబిడ్డల వలె పాలిస్తాయి అంటే ఎలా నమ్ముతారు? విద్యా వైద్యాన్ని ఉచితంగా నాణ్యమైన స్థాయిలో కల్పిస్తారని అనుకుంటే అది సాధ్యమేనా? పరిష్కారం ఎలా? ఆలోచించండి.

**వడ్డేపల్లి మల్లేశం..**
**సామాజిక రాజకీయ విశ్లేషకుడు**

వేద న్యూస్

బుధవారం ఏప్రిల్ 23, 2025




## సంచలనం సృష్టించిన ధ్రువ కళాశాల

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

మంగళవారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో ధ్రువ జూనియర్ కళాశాల అద్భుతమైన ఫలితాలతో సాటిలేని పోటీతో సత్తా చాటారు. వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ ధ్రువ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినిలు 2024 -25 విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాలలో రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధించి విజయ ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా ధ్రువ జూనియర్ కళాశాల చైర్మన్ ఆకుల శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ ఆకుల సంపత్, ఆకుల సతీష్ కుమార్ లు అద్భుత ఫలితాలు సాధించడంలో కృషిచేసిన అధ్యాపక బృందాన్ని, సాటిలేని రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధించిన విద్యార్థిలను ఈ సందర్భంగా అభినందించారు.

## ఎంక్వయిరీల పేర్లతో కాలయాపన వద్దు

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**



ఎంక్వైరీల పేర్లతో లబ్ధిదారులకు అందవలసిన పథకాలు ఆలస్యం చేయకుండా వారికి సత్వరమే పథకాలు అందజేయాలని భారతీయ జనతా పార్టీ మీర్ పేట అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి అన్నారు. 27వ డివిజన్లో వార్డు ఆఫీసర్ సాయి కిరణ్, స్పెషల్ అధికారితో కలిసి ఆవాస్ యోజన పథకం, ప్రభుత్వ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంక్వయిరీ చేయడం జరిగిందని ప్రజలకు ఇచ్చిన ప్రభుత్వ పథకాలన్నీ నెరవేర్చాలని లేని యెడల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రజలలోకి వెళ్లి ప్రజలకు ప్రభుత్వం చేసిన మోసాలను వివరించి ప్రజలే ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే విధంగా చేస్తామని హెచ్చరించారు. ఎంక్వైరీల పేరుతో కాలయాపన చేస్తూ ఉంటే చూస్తూ ఊరుకోమని బిక్షపతి చారి అన్నారు.

## భూ భారతి చట్టం నిరుపేద రైతులకు వరం

**వేద న్యూస్, శాయంపేట:**



పేద రైతుల కన్నీటిని తీర్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చింది ఐఎన్టియుసి మండల అధ్యక్షుడు మారపెల్లి రాజేందర్ అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో భూమి సమస్యలు లేని రాజ్యంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని,ప్రజలను ఇబ్బంది పెట్టకుండా రైతులకు సేవలు అందిస్తామన్నారు. భూభారతి చట్టంతో రైతులకు తన భూమిపై యాజమాన్యం హక్కు ఉంటుంది. పదేళ్ల ధరణితో అన్నదాతలు అనేకరకాలుగా ఇబ్బందులు పడ్డారు.ధరణి కారణంగా యాజమాన్యం హక్కులు కోల్పోయి రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. 2010 నుండి ఇప్పటివరకు పహాని నకలు అందుబాటులో లేవు అంటే ధరణి ద్వారా రైతులు చాలావరకు ఇబ్బందులు పడ్డారు.2010 నుండి ఇప్పటివరకు ఏ రైతు కాస్తులో ఉన్నాడో కబ్జాలో ఉన్నాడో తెలవకపోవడం సిగ్గుచేటు అని ఎద్దేవా చేశారు.అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలు తీర్చడానికే భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని ఐఎన్ టియుసి శాయంపేట మండల అధ్యక్షుడు మారేపెల్లి రాజేందర్ అన్నారు.

## పని దినాలను తగ్గించిన కేంద్రం..!

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రత్యేక ప్రతినిధి :**



తెలంగాణలో ఉపాధి హామీ పనిదినాల్లో కేంద్ర ప్రభుత్వం భారీగా కోత విధించింది. ఉపాధి కోసం కూలీలు వలసలు వెళ్లకుండా ఆకలి చావులు లేకుండా ఉండాలనే ఉద్దేశంతో ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అయితే కేంద్ర ప్రభుత్వం రోజురోజుకూ పలు నిబంధనలు మార్గదర్శకాల పేరిట ఈ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నదని పెద్దఎత్తున విమర్శలొస్తున్నాయి. ఉపాధి హామీ పథకాన్ని ఎక్కువగా ఉపయోగించుకునే రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. కానీ కేంద్రం తెలంగాణకు ఏటా కేటాయించే పనిదినాల్లో సగానికి సగం కోత పెట్టింది. గత ఐదు సంవత్సరాల ఉపాధి హామీ పనిదినాలను పరిశీలిస్తే ఏనాడూ 12 కోట్లకు తక్కువగా నమోదు కాలేదు. కానీ ప్రస్తుతం ఆర్థిక సంవత్సరానికి మాత్రం గత పని దినాల్లో సగమే కేటాయించింది. దీనిపై గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇంత తక్కువగా పనిదినాలను ఏనాడూ కేటాయించలేదని, కేంద్రం తీరు 'ఉపాధి హామీ'ని నిర్వీర్యం చేసేలా ఉందని గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ నిపుణులు, సంఘాలు ఆరోపిస్తున్నాయి.

# దిగి వస్తున్న ఉల్లి ధర

- మార్కెట్లో కిలో రూ.15
- ఎగుమతి సుంకం కేంద్రం ఎత్తివేయడంతో ఎఫెక్ట్
- మార్కెట్లకు పోటెత్తుతున్న స్థానిక పంట

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**



తెలంగాణలో గత కొన్ని రోజులుగా పెరిగిన ఉల్లి ధరలు సామాన్యులకు కన్నీళ్లు పెట్టించాయి. ప్రస్తుతం మార్కెట్లో ఉల్లిపాయల ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. నగరంలోని మలక్ పేట, మీరాలం మండి మాదన్నపేట మండీలలో మార్కెట్లలోను ఉల్లి ధరలు భారీగా పడిపోయాయి. గత నెలతో పోలిస్తే ఉల్లి ధరలు భారీగా పడిపోయాయి. బహిరంగ మార్కెట్లో మొన్నటి వరకు కిలో రూ.40 వరకు ఉన్న ధర ఇప్పుడు రూ.15 పడిపోయింది. మలక్పేట మార్కెట్లో క్వింటాలు రూ.1200 ఉండగా కనిష్టంగా రూ.500 పలుకుతుంది. ఈ యాసంగి దిగుబడి మార్కెట్లో వస్తూ ఉండడంతో ఈ ధరలు మరింతగా తగ్గే అవకాశం ఉందని వ్యాపారవేత్తలు చెబుతున్నారు. మరోవైపు ఉల్లి రైతులు తమకు ఆదాయం లేక నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డిమాండ్ కంటే ఎక్కువగా సప్లై ఉండడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని వ్యాపారులు చెబుతున్నారు. ఉల్లి పంట ఏప్రిల్, మే నెలలో మార్కెట్లోకి వస్తుంది. ఈ క్రమంలోనే మార్కెట్లకు ఉల్లిగడ్డలు భారీగా వస్తున్నాయి. హైదరాబాద్ సిటీలో మార్కెట్లకు రోజుకు 15000 నుంచి 18 వేల క్వింటాళ్ల ఉల్లిగడ్డలు వస్తున్నాయి. మలక్పేట ఉస్మాన్ గంజి మార్కెట్లకు రోజు 5000 క్వింటాళ్ల పైగా గ్రేడ్ వన్ రకం ఉల్లిగడ్డలు వస్తున్నాయి. ఇది ఇలా ఉండగా ఉల్లిపాయ 20 శాతం ఎగుమతి సుంకాన్ని ఎత్తివేస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. దీనితో ధరలు మరింత తగ్గాయి 2023 డిసెంబర్లో దేశవ్యాప్తంగా ఉల్లి సంక్షోభం ఏర్పడింది. దీనితో ఉల్లిగడ్డల ఎగుమతి పై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది 2024 మేలో ఎగుమతులు నియంత్రించినప్పటికీ కనీస ఎగుమతి ధర పెంచింది. ఆ క్రమంలో 40 శాతం ఎగుమతి సుంకాన్ని విధించింది. తర్వాత 20 24 సెప్టెంబర్ లో కనీస ఎగుమతి ధరలు రద్దుచేస్తూ 20శాతం ఎగుమతుల సుంకాన్ని వసూలు చేసింది. ఈ నిర్ణయం దేశంలో ఉల్లి ధరలు తగ్గేందుకు లోకల్ మార్కెట్లలో సరఫరా పెరిగేందుకు దోహదపడింది. తాజాగా ఈ సుంకాన్ని ఎత్తివేయడంతో పాటుగా స్థానికంగా పండించిన ఉల్లి మార్కెట్లలోకి పోటు ఎత్తుతూ ఉండడంతో వాటి ధరలు భారీగా తగ్గుముఖం పట్టాయి.

# ప్రభుత్వం రైతులను తక్షణమే ఆదుకోవాలి

- ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ పర్యటన నేపథ్యంలో బిఆర్ఎస్ నాయకులను నిర్బంధించిన పోలీసులు

**వేద న్యూస్, ఖానాపురం :**



ఖానాపురం మండలంలో పడిన వడగండ్ల వానకు నష్టపోయిన మొక్కజొన్న, వరిపంట, మిర్చి రైతులను ఆదుకోవాలని గత కొన్ని రోజులుగా ఖానాపురం బిఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో నష్టపోయిన పంటలను పరిశీలించి, ఆందోళనలు చేసినప్పటికీ స్థానిక ఎమ్మెల్యే, అధికారులు స్పందించలేదని ఖానాపురం మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు నర్సంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. ఖానాపురం పర్యటనకు వస్తున్న జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే అధికారులు వస్తున్నారన్న సమాచారంతో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నష్టపోయిన రైతులతో కలిసి వారి గోడుచెప్పి రైతులను ఆదుకోవాలని వినతిపత్రం సమర్పించడానికి అధికారుల వద్దకు వెళుతుంటే పోలీసులు నిర్బంధించడం ఎంతవరకు సమంజసమని అన్నారు. వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలను మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి హుటాహుటిన సంఘటన స్థలానికి వచ్చి దెబ్బతిన్న పంటలను పరిశీలించి బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులను ఓదార్చి సర్వే చేయించి, పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగిందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే నష్టపోయిన రైతులను పరామర్శించకుండా ప్రభుత్వ కార్యక్రమానికి రావడంపై రైతులపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి కనపడుతుందని ఎద్దేవా చేశారు. ఖానాపురం మండల వ్యాప్తంగా నష్టపోయిన పంటలను సర్వే చేయించి తక్షణమే రైతులను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో మనుబోతుల గడ్డ మాజీ సర్పంచ్ వల్లపు సోమయ్య, సొసైటీ డైరెక్టర్ ఆబోతు అశోక్, ఖానాపురం గ్రామపార్టీ అధ్యక్షులు మచ్చిక అశోక్,మనుబోతుల గడ్డ గ్రామపార్టీ అధ్యక్షులు తేజవత్ బాలు నాయక్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు రెడ్డి నాగార్జున రెడ్డి, మర్రి రామస్వామి, కుందనపెల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతును ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

- రాంగ్ రూట్లో వచ్చి రైతు పైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు
- అక్కడికక్కడే రైతు దుర్మరణం
- బస్సు ఎదుటే మృతుని కుటుంబ సభ్యుల ఆందోళన

**వేద న్యూస్, కమలాపూర్ :**



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామంలోని బస్టాండ్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కమలాపూర్ మండలం కన్నూర్ (రాములపల్లి) గ్రామానికి చెందిన రాంరెడ్డి (52) అనే రైతు ఉప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే క్రమంలో హుజురాబాద్ నుండి పరకాల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఉప్పల్ బస్టాండ్ కు నిబంధనలకు విరుద్ధంగా రాంగ్ రూట్లో వచ్చి బలంగా ఢీకొట్టడంతో రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుని బంధువులు, కుటుంబ సభ్యులు ఘటన జరిగిన సమయం నుంచి చాలా సమయం వరకు కూడా మృతదేహాన్ని తీసుకు వెళ్ళకుండా తమకు న్యాయం జరిగితేనే ఇక్కడి నుంచి మృతదేహాన్ని తీసుకువెళ్తామని, తమకు న్యాయం చేయాలంటూ నిరసనకు దిగారు. ఈ యాక్సిడెంట్ ఘటన పై సమాచారం అందుకున్న కమలాపూర్ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మృతుని కుటుంబ సభ్యులకు, బంధువులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం శుభప్రదం అని హెడ్డింగులు రాసి ఉంచే యాజమాన్యం కేవలం బస్సులో ప్రయాణించే వారికేనా ? బయట రోడ్డుపై ప్రయాణించే వారి పైకి మాత్రం రాంగ్ రూట్లో వచ్చి బస్సెక్కిస్తారా అంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఆర్టీసీ డ్రైవర్లు కొంతమంది దూకుడుగా వ్యవహరిస్తూ గ్రామాలలో రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాలలో, సర్కిల్స్ దగ్గర, బస్టాండ్ సమీపాల్లో వేగంగా బస్సును నడుపుతూ ప్రయాణికులలో, ప్రజలలో కొంత భయానక వాతావరణం సృష్టిస్తున్నారనేది నిజం. ఇప్పటికైనా ఆర్టీసీ యాజమాన్యం ఘటనకు బాధ్యత వహిస్తూ మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి నష్టపరిహారం అందించి తగిన న్యాయం చేయాలని, అలాగే ఇలా విధుల పట్ల అలసత్వం ప్రదర్శించి నిబంధనలు అతిక్రమించి నిబంధనలకు విరుద్ధంగా బస్సును నడిపి ప్రజల ప్రాణాలు తీస్తున్న డ్రైవర్ల పై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

మొదటి పేజీ తరువాయి

తీగల జీవన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దళిత ఆదివాసీ బహుజనులపై హిందూ మతోన్మాద దాడులు పెరుగుతున్నాయ న్నారు. కేంద్ర ప్రభుత్వం మనువాద విధానాలు అనుసరిస్తూ రాజ్యాంగంలో పేర్కొన్న హక్కులను హరిచేస్తుందని ఆయన విమర్శించారు.ఈ సమయంలో విప్లవ పార్టీల ఐక్యత ఆవశ్యకత ఏర్పడిందని ఆయన తెలియజేశారు.పి డి ఎస్ యు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ రష్యా సోషలిస్టు నిర్మాత కామ్రేడ్ లెనిన్ చేసిన పోరాటాలను విజయాలను అధ్యయనం చేయాలని మనదేశంలో కూడా నూతన ప్రజా స్వామిక విజయవంతం కోసం జరుగు పోరాటాలలో విద్యార్థులు పాల్గొనాలని అన్నారు. ఏఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు భైరబోయిన ఐలయ్య, పివైఎల్ జిల్లా నాయకులు గంద్రతి హరిబాబు, పిడిఎస్యు జిల్లా నాయకులు రాజేష్, ఐఎఫ్టియు నాయకులు గద్దల ప్రభాకర్, ఎండి ఖాన్, పాలకుర్తి సత్యనారాయణ, ఇనుముల కృష్ణ, సుద్దాల వీరన్నలతో పాటు బండి రవి, మన్నె కరుణాకర్, యాకయ్య, కృష్ణ, అక్బర్, రవి, చంద్రమౌళి పాల్గొన్నారు.

## వేసవి వడగాలుల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

మొదటి పేజీ తరువాయి

సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. స్వచ్ఛంధ సంస్థల సహకారంతో ముఖ్యమైన పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చల్లని తాగునీరు, చాలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. సాంస్కృతిక సారధి కళాకారులతో వడగాల్పులపై ప్రచారం చేయాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రా ల్లో టీచర్ల ద్వారా గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. ఉపాధిహామీ పనులకు సంబంధించి సమయాలను మార్చుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు,ఆర్టీసీ బస్ స్టాండ్ లలో ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచాలని, పశువులు సంచరించే ముఖ్య కూడలలో నీటి కుండీలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో డిఆర్ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిఎంహెచ్ఓ సాంబశి వరావు, పిడి హౌసింగ్ గణపతి, డిసిఓ నీరజ, ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి ఉమారాణిలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మధుర ఫలం మామిడికి ఫిదా కాని వారు ఎవరు?

**వేద న్యూస్, అక్కినేపల్లి పురుషోత్తమరావు :**

మండుటెండలో సైతం మర్చిపోయేలా చేసే మామిడి పండ్లు మల్లెపూలు గ్రీష్మతువులో దక్కే వరాలు అందుకే గ్రీష్మాన్ని ఆమ్ర ఫలాలు అందించే అమృత రుతువు అన్నారు. వృత్తుల విషయంలో మామిడిపండు ది రాజస మాధుర్యం. దానికి ఫల రాజంఅని పేరు కామ్రు ఫలానికి రాజయోగం దక్కడంతో తక్కిన అసూయకు లోనయ్యాయి. నేరేడు మొహం మాడ్చుకుంది. నారికేలానికి గుండె నీరయ్యింది. దానిమ్మకు ఎదముక్కలయ్యింది అని చమత్కరించారు. బొమ్మ విలాపంలో జగన్నాథ పండితరాయలు నేరేడు నల్లధనాన్ని కొబ్బరిలో నీటిని పక్వానికి రాగానే పగిలి ఎర్ర గింజలు దానిమ్మ లక్షణాన్ని వెల్లడించి త్రపోశ్యమా ప్రసిద్ధ శ్లోక సారాంశం అది చూత ఫల రసం జవరాలి అధరం అన్నారు వేమన. మామిడిపండు మాధుర్యానికి అంతకన్నాయోగ్యతాపత్రం ఏం కావాలి! పండుగనే



కాదు కాయగాను మామిడిది రాచ ఠీవీ. పచ్చిదైనా గాని పక్వ మొందిన గాని సూతఫలము చూడ జాతి ఘనము అనేది అందుకే.

తెలుగువారికి ఆవకాయకు మధ్య అన్యోన్య అనుబంధం అనిర్వచనీయం. నిజానికి ఆవకాయ పెట్టడం అంటే చచ్చేంత చాకిరి. ఆమ్ర సెలెటవులు కాయలు నేర్పుగా ఎంపిక చేసి కడిగి ముక్కలు కొట్టి జీడి తుడిచి ఆవరేవను కూర్చి మిరపకారము ఉప్పు మెంతులు జత చేసి పప్పు నూనె ఒంపి తిప్పి తిప్పి జాడీలకు ఎక్కించడం చిన్న పనేం కాదు అది రసవత్తర ప్రక్రియ శ్రమ అయితే అయ్యింది కానీ వేడి వేడి అన్నంలో కొత్తవకాయ కలగలిపి తింటుంటే మహాప్రభో కడుపే కైలాసం కాదు. కలుపుతుంటే కళ్ళల్లోనూ చూస్తుంటే నోళ్ళల్లోనూ నీళ్లు ఊరాయి అంటే అదే కదా కొత్తవకాయ మహిమ. అలాగే గడ్డ పెరుగు అన్నం ముద్దను మాగాయ టెంకతో జుర్రుకుంటుంటే దాని సిగదరగా స్వర్గానికి బెత్తెడు దూరం పైగా అది ఈనాటి ముచ్చట కాదు ఆ మాటకు వస్తే గుండు మామిడి అమ్మ చెట్టు వంటి కొన్ని మేలు జాతులు అంతరించిపోయాయి గ్రాఫ్టింగ్ ఉంటే సాంకేతికతతో వాటిని తిరిగి జీవం పోస్తున్నాము అంటున్నారు నగరానికి చెరువులో ఉన్న సంగారెడ్డికి చెందిన పల పరిశోధనా నిపుణులు. విశ్వనాథ మాదిరి సహజ సిద్ధమైన రుచి చూపించాలన్నది వారి ప్రయత్నం చెట్టు సారం ఫలాలలోనూ మనిషి సారం పనులలోను తెలుస్తుంది కాబట్టి పాత రోజులు తిరిగి వస్తాయేమో చూడాలి.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073